క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పలువురికి జరిమానా

సూర్యాపేటటౌన్ : మద్యం సేవించి వాహనం నడిపిన ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష, రూ.2000 జరిమానా విధిస్తూ సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ తీర్పు చెప్పినట్లు మంగళవారం సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. సూర్యాపేటలోని పలు ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా ఆరుగురు పట్టుబడ్డారన్నారు. వారిని కోర్టులో హాజరుపర్చగా ఒక్కరికి రెండు రోజుల జైలు శిక్ష, జరిమానా మిగతా వారికి రూ.1500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారని పేర్కొన్నారు. మద్యం సేవించి ఎవరైనా వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు.

బడిబాట ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

అర్వపల్లి : మండల పరిధిలోని కోమటిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ మన కోమటిపల్లి అనే నినాదంతో హెచ్ఎం ఉల్లెందుల సైదులు ఆధ్వర్యంలో గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ పాఠశాల నుంచి తేలు రిషి, నున్న విష్ణుతేజ్‌లు గురుకుల విద్యాలయానికి ఎంపికవడంతో వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఆర్.సృజన, ఏపీసీ చైర్‌పర్సన్ షమీనా, మాజీ సర్పంచ్ జాల నర్సయ్య, అంగన్‌వాడీ టీచర్ శివరంజని, నున్న మమత, తేలు మమత, జానిమియ, యల్లయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారం ప్రదర్శన


అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం ప్రదర్శిస్తున్న సిబ్బంది, తదితరులు

అర్వపల్లి : కోమటిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్షోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ప్రదర్శన జరిపారు. పౌష్టికాహార ప్రాముఖ్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో పీఎస్ హెచ్ఎం ఉల్లెందుల సైదులు, అంగన్‌వాడీ టీచర్ తొడుసు శివరంజని, ఉపాధ్యాయురాలు ఆర్.సృజన, ఎంఎల్‌హెచ్‌పీ వశ్రిత, ఏఎస్ఎంలు అనంతుల సరస్వతి, ఊర్మిళ, శ్రీనువాస్, శోభ, మునిత, అనిత, స్రవంతి, ఆయాలు యశోద, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు


ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో జరుగుతున్న గంగదేవమ్మ ఉత్సవాలు ముగిశాయి. చివరి రోజున డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, పెసర సతీష్ రెడ్డి, రత్నం సంతోష్, మహేష్, బోరోజు ఉపేందర్, వేములకొండ ఉప్పలయ్య, శ్రీధర్‌రెడ్డి, నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వన నర్సరీ పరిశీలన

అర్వపల్లి : మండల పరిధిలోని రామన్నగూడెంలో వన నర్సరీని మంగళవారం ఎంపీడీఓ టి.గోపి పరిశీలించారు. వేసవిలో ఎండలు తీవ్రమైనందున మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఉదయం, సాయంత్రం వేళలో మొక్కలకు నీళ్లు పోయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జొన్నలగడ్డ సుధాకర్, నిర్వాహకులు పాల్గొన్నారు.

పథకాలపై కళాజాత

నూతనకల్ : ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సాంస్కృతిక సారధి జిల్లా టీమ్ లీడర్ పాలకుర్తి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో రైతుభరోసా, సన్నబియ్యం, ఉచిత విద్యుత్, రుణమాఫీ, సబ్సిడీ వంటగ్యాస్ తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్‌రెడ్డి, కళాబృందం సభ్యులు వీర్ల సైదులు, గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, ఉపేందర్, గజ్జి మంజుల, రాధ, స్రవంతి, శిరీష తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

నిర్వహణ లేక నిరుపయోగంగా..



అంబేద్కర్‌నగర్ పార్కు బోర్డు


తుప్పు పట్టిన ఆట వస్తువులు



కూర్చోవడానికి వీలు లేకుండా విరిగిన కుర్చీలు

- అంబేద్కర్‌నగర్ పార్కులో కొరవడిన వసతులు
- నెలల తరబడి ఊడ్చకపోవడంతో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- తుప్పుపడుతున్న ఆటవస్తువులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణానికి శివారు ప్రాంతం అంబేద్కర్‌నగర్ ప్రారంభంలో పార్కు అందాలతో ఆహ్లాదకరంగా దర్శనమిచ్చేది. పక్కనే రామాలయం ఉండటంతో నిత్యం వచ్చే భక్తులు దర్శనం అనంతరం పార్కులో సరదాగా కాసేపు గడిపి వెళ్లేవారు. ముఖ్యంగా వేసవిలో చల్లదనం కోసం చెట్ల కింద కూర్చునేందుకు పట్టణవాసులు పార్కుకు వెళ్లేవారు. కానీ ఆ పార్కు ప్రస్తుతం వసతులు కరువై నిరుపయోగంగా దర్శనమిస్తోంది.

సమస్యలతో వెలవెలబోతున్న పార్కు..

అంబేద్కర్‌నగర్‌లోని పార్కులో విరిగిన కుర్చీలు, తుప్పుపట్టిన ఆట వస్తువులు, తెగిపోయిన ఊయ్యాలలు దర్శనమిస్తున్నాయి. కనీసం పార్కును శుభ్రం చేయకపోగా, మొక్కలకు నీటి సౌకర్యం లేకపోవడంతో ఎండిపోతున్న దుస్థితి కనబడుతోంది. పార్కులోని మూత్రశాలలకు కూడా తాళాలు వేసి ఉంచుతున్నారు. ఆట వస్తువులు తుప్పు పట్టి నిరుపయోగంగా ఉండటంతో పిల్లలు కూడా పార్కుకి రావడానికి ఇష్టపడటం లేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు చొరవతీసుకొని పార్కులో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


తాళాలు వేసి ఉన్న మూత్రశాలలు

సౌకర్యాలు కల్పించాలి



ప్రతిరోజూ ఉదయం వాకింగ్ వెళ్లి పార్కు పక్కనుంచే వస్తుంటాను. పార్కులో సౌకర్యాలు లేకపోవడంతో అందులోకి వెళ్లడం లేదు. పార్కులో నీటి సమస్యను అధిగమించి మొక్కలకు నీరు అందించాలి. గార్డెనింగ్ మెరుగుపరచాలి. సిమెంటు కుర్చీలు ఏర్పాటు చేయాలి. మూత్రశాలలు అందుబాటులోకి తీసుకురావాలి. పిల్లలు ఆడుకోవడానికి సరైన ఆట వస్తువులను ఏర్పాటు చేయాలి. అలాగే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి.

– బుర్రి వెంకటేశ్వర్లు, సూర్యాపేట

అందాల పోటీలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న రామలింగమ్మ

సూర్యాపేట అర్బన్ : తెలంగాణలో మే 7 నుంచి జరిగే అందాల పోటీలను రద్దు చేయాలని పీఓడబ్ల్యూ, పీవైఎల్, పీడీఎస్‌యూ జిల్లా కమిటీల నాయకులు డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కంచర్ల నర్సక్క, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా కేసీఆర్ బాటలోనే నడుస్తున్నాడని అన్నారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రంలో అందాల పోటీలకు వందల కోట్లు ఖర్చు పెట్టడం సరికాదన్నారు. మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక ద్వారా వివిధ మహిళా సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు, సమావేశాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర నాయకుడు బండి రవి, పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు రామలింగమ్మ, పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు సుజాత, జయసుధ, ఉపేంద్ర, పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి వీరబోయిన రమేష్, జిల్లా నాయకులు దండి ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి మార్కెట్ చైర్‌పర్సన్‌కు సన్మానం


మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న నాయకులు

తిరుమలగిరి : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతినరేష్‌ను మంగళవారం తాటిపాముల కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎర్ర యాదగిరి, కిషన్, పులిమామిడి యాదగిరి, నర్సింహ, రమేష్, సామేల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో సన్మానం..

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మార్కెట్ చైర్‌పర్సన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తన్నీరు రాంప్రభు, కొత్తగట్టు మల్లయ్య, వై.దీన్‌దయాళ్, శ్రీకాంత్, రామచంద్రం గౌడ్, గిరి గౌడ్, సుందర్, శ్రీనివాసులు, బ్రహ్మం, శ్యామ్ యాదవ్, యాదగిరి, కిరణ్, భిక్షం, ఉపేందర్, విజయ్, చంటి, తరుణ్, రషీద్ పాల్గొన్నారు.

కొమురయ్య చిత్ర నిర్మాణం అభినందనీయం


భీంరెడ్డి నర్సింహారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సూర్యాపేట అర్బన్ : తెలంగాణ సాయుధ పోరాటం ఇతివృత్తంగా దొడ్డి కొమురయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని చిత్ర నిర్మాణం చేయడం అభినందనీయమని ప్రముఖ వైద్యుడు, ఉండ్రుగొండ దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ వూర రామ్మూర్తియాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజా సంఘాల నాయకులు ప్రతి ఒక్కరి నుంచి రూ.15 వసూలు చేసి దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర చిత్రాన్ని నిర్మిస్తున్న సందర్భంగా మంగళవారం చిత్ర యూనిట్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భీంరెడ్డి నర్సింహారెడ్డి విగ్రహం వద్ద చిత్ర పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. భీంరెడ్డి నర్సింహారెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సినిమా డైరెక్టర్ సేనాపతి, ప్రజా సంఘాల నాయకులు బొమ్మిడి లక్ష్మీనారాయణ, చల్లమల్ల నర్సింహ, భూపతి నారాయణ, మల్లు నాగార్జున రెడ్డి, కొత్తపల్లి శివకుమార్, ముల్కలపల్లి రాములు, తప్పెట్ల శ్రీరాములు, జె.నరసింహారావు, వజ్జె వీరయ్య, కొడి సైదులు, కోడి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దిరాల : రెడ్డిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని రాజానాయక్ తండా, ముకుందాపురం సబ్ స్టేషన్ పరిధిలోని ముకుందాపురం గ్రామాలకు 11కేవీ విద్యుత్ వైర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని కోరారు.

కొనుగోళ్లు ప్రారంభించాలి

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు తొట్ల ప్రభాకర్ అన్నారు. మంగళవారం మద్దిరాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాలు పడుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు వెంకట్‌రెడ్డి, భాస్కర్, వెంకన్న, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- కుడకుడ రోడ్డు స్నేహనగర్‌లో చేతికందే ఎత్తులో ఏర్పాటు
- రక్షణ వలయం కూడా లేకపోవడంతో భయాందోళనలో కాలనీవాసులు


ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

సూర్యాపేట అర్బన్ : కుడ కుడ రోడ్డులోని స్నేహనగర్ రోడ్ నంబర్–2లో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. చిన్న పిల్లలకు సైతం చేతికి అందే ఎత్తులో, దాని చుట్టూ ఎలాంటి రక్షణ వలయం లేకుండా ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు ఆనుకుని ఉండటంతో స్థానికులు అటుగా వెళ్లాలంటేనే భయపడుతున్నారు. వర్షాకాలం వస్తే ఎర్త్ అవుతుందనీ తెలుపుతున్నారు. చిన్నపిల్లలు ఆడుకునే ప్రదేశం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి మార్చాలని కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ అధికారిని వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ వెంటనే రక్షణ వలయాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వేరే చోటుకు మార్చాలి



కుడకుడ రోడ్డు స్నేహనగర్ రోడ్ నంబర్–2లో రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. అక్కడి నుంచి వెళ్లాలంటే భయంగా ఉంది. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి, జనాలు తిరగని ప్రాంతంలో ఏర్పాటు చేయాలి.

– హరి, స్నేహనగర్

దేవాలయ ధర్మకర్తల ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ధర్మకర్తలు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ధర్మకర్తలుగా నియమితులైన అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, జెగ్రిపోతుల సోమయ్య, ఆకుల సోమయ్య, బీరెల్లి శ్రీధర్‌రెడ్డిలను మంగళవారం దేవాలయ ఆవరణలో దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా ఇన్‌స్పెక్టర్ సుమతి, ఈఓ వై.శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తిలు ప్రమాణ స్వీకారం చేయించారు. 10 రోజుల తర్వాత చైర్మన్ ఎన్నిక ఉంటుందని ప్రకటించారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన ధర్మకర్తలతో డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి కలిసి ప్రత్యేక పూజలు జరిపారు. ధర్మకర్తలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి రాజయ్య, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, పెసర సతీష్‌రెడ్డి, బింగి కృష్ణమూర్తి, నర్సింగ కృష్ణమూర్తి, రత్నం సంతోష్, వల్లాల ఖాజ, మాజీ సర్పంచ్ మడ్డి పద్మ, ఎల్లంల కొమిరెల్లి, మామిడి సత్యనారాయణ, దిర్శనపు రాజేష్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించాలి

చివ్వెంల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ప్రారంభించాలని గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటివరకు పనులు ప్రారంభించక పోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పని కల్పించిన గ్రామాల్లో ఒకవారం ఒక గ్రూప్, మరొక వారం మరో గ్రూప్‌కు పని కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబానికి 150 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పనులు జరిగే చోట కనీస వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొనకంచి వీరభద్రయ్య, భాష్పంగు సునీల్, అనంతుల యల్లయ్య, వెంకన్న, బాబు, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ


నూతనకల్ : దాతలు అందించిన పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

చివ్వెంల : బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘ్ (టీబీఎస్ఎస్) ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని మంగళితండా, జగరాతండా, వాల్యతండా, గుడితండా, పండిబండ తండా, భానోత్య తండా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.రవీందర్ నాయక్, హెచ్ఎం పాదిల రవీందర్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


చివ్వెంల : పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

దాతల సహకారం సద్వినియోగం చేసుకోవాలి

నూతనకల్ : దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వాంకుడోతు వెంకన్న నాయక్ అన్నారు. కట్టంగూర్ తహసీల్దార్ ప్రసాద్‌నాయక్ ఆర్థిక సహకారంతో బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం ఆధ్వర్యంలో సమకూర్చిన పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను మంగళవారం జాల్‌తండా, సోమ్లాతండా, బక్క హేమ్లతండా, టీక్యాతండా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గుగులోతు కృష్ణానాయక్, మూడ్ శంకర్‌నాయక్, ప్రధానోపాధ్యాయుడు గునగంటి శ్రీనివాస్, సామ ఇంద్రారెడ్డి, మన్నెం శ్రీదేవి, శ్రీనివాస్‌రెడ్డి, సుజాత పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం


తుంగతుర్తి: గొట్టిపర్తిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చెవిటి వెంకన్న


చివ్వెంల : పాండ్యానాయక్ తండాలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

తుంగతుర్తి : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గొట్టిపర్తిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరను పొందాలని అన్నారు. అలాగే సంగెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మోడం శ్రీలత, రవీందర్ రెడ్డి, సీఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్వపల్లి : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వేల్పుచర్ల గ్రామంలో ఎస్‌డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, గ్రామ అధ్యక్షుడు వజ్జె రవియాదవ్, చెరుకు వెంకన్న, చిక్కుల శేఖర్, గైగుళ్ల వీరయ్య, శ్రీకాంత్, యాదయ్య, కిరణ్, జగన్, అంజయ్య, ప్రభాకర్, నాగరాజు, సమ్మయ్య, శంకర్, బాలకృష్ణ, సతీష్, మహేష్, వెంకటయ్య పాల్గొన్నారు.


అర్వపల్లి : వేల్పుచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మధుకర్‌రెడ్డి

చివ్వెంల : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావతు వీరన్న నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పాండ్యానాయక్ తండాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సైదయ్య, ఏఓ వెంకటేశ్వర్లు, వీబీకే షర్మిల, ధరావతు వెంకన్న నాయక్, లాలు నాయక్, సమీర్, హాము నాయక్ తదితరుల పాల్గొన్నారు.

గోదావరి జలాల నిలిపివేత

అర్వపల్లి : మైలారం రిజర్వాయర్ నుంచి జనగామ జిల్లా బయ్యన్నవాగుకు గోదావరి జలాలు వచ్చే ఎస్సారెస్పీ కాలువ యూటీకి బయ్యన్నవాగు సమీపంలో మరమ్మతు చేపట్టడానికై వాగు బ్యాక్ వాటర్ తొలగించటం కోసం నీటిని ఈ నెల 12న సూర్యాపేట జిల్లాకు విడుదల చేశారు. సుమారు 600 క్యూసెక్కుల నీటి చొప్పున 5 రోజుల పాటు నీటిని వదిలారు. అయితే బయ్యన్నవాగులో బ్యాక్ వాటర్ తగ్గి యూటీ మరమ్మతు పనులకు అవకాశం ఏర్పడటంతో గోదావరి జలాలను మంగళవారం నిలిపివేశారు. నీళ్లు తగ్గటంతో యూటీ మరమ్మతు పనులను చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

వెంకటమ్మకు నివాళి

తిరుమలగిరి : తిరుమలగిరి మండలంలోని వెలిశాలకు చెందిన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి తల్లి మర్రి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మంగళవారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, భిక్షమయ్యగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు రఘునందన్ రెడ్డి, కొమ్మినేని సతీష్, దూపటి రవీందర్, యాకూబ్, తదితరులు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెన్‌పహాడ్ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపికృష్ణ తెలిపారు. దోసపహాడ్ శివారులోని మూసీ నుంచి 2 ట్రాక్టర్‌ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వడగండ్లు.. రైతులకు కడగండ్లు


కొత్తతండాలో నేలవాలిన వరిపైరు


ఇస్తాళాపురంలో రాలిన వడ్లు

- నేలరాలిన వరి ధాన్యం, మామిడి కాయలు
- భారీగా నష్టపోయిన అన్నదాతలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

ఆత్మకూర్(ఎస్): లక్షల పెట్టుబడి పెట్టి, ఆరుగాలం శ్రమించి పంటలు సాగుచేసిన రైతులకు వడగండ్ల రూపంలో వచ్చిన ఆపద కడగండ్లను మిగిల్చింది. గత ఆదివారం మండలంలో వడగండ్లతో ఈదురు గాలులు వీయడంతో వందల ఎకరాల్లో వరి పొలాలు నేలవాలి వడ్లు రాలి నేలపాలయ్యాయి. పంట చేతికందే దశలో నేలపాలవడంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. మండల పరిధిలోని పాతర్లపహాడ్, ఇస్తాళాపురం, ముక్కుడు దేవులపల్లి, రామన్నగూడెం, ఏపూరు, ఆత్మకూరు, నెమ్మికల్, కోటి నాయక్ తండా, ఏనుబాముల, నసీంపేటతోపాటు పలు గ్రామాల్లో వందల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 558 ఎకరాల్లో వరి పంట నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చినప్పటికీ అది మరింత పెరిగే అవకాశం ఉంది. అదేవిధంగా మామిడి రైతుల పరిస్థితి మరింత దయానియంగా తయారైంది. ఈదురు గాలుల దెబ్బతో మామిడి తోటలో కాయలన్నీ రాలిపోయాయి. దీంతో మామిడి రైతులు కూడా నష్టపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఐదు ఎకరాల్లో నష్టపోయాం



వడగండ్ల కారణంగా ఐదు ఎకరాల్లో వరి పంట నేలరాలిపోయింది. ఈ సంవత్సరం ఎస్సారెస్పీ నీళ్లు రాక, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పంటల సాగుకు ఎంతో ఇబ్బందులుపడ్డాం. తీరా పంట చేతికందే దశలో వడగండ్లు రావడంతో వడ్లన్నీ నేలరాలిపోయాయి. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– మున్నా గణేష్, యువ రైతు, ఇస్తాళాపురం